# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 17, జనవరి 2026





## సబ్బండ వర్గాల అభివృద్ధే

# ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయం



- ✦ బాసరలో విశ్వ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు
- ✦ సదర్మాట్ బ్యారేజికి పి. నర్సారెడ్డి పేరు పెడతాం
- ✦ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**నిర్మల్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:**

సబ్బండ వర్గాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా నూతన రేషన్ కార్డులు అందివ్వడంతోపాటు, ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి ఎన్నో రకాల పథకాలతో రాష్ట్ర ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా, మహిళా సంఘాల సభ్యులను వెయ్యి బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. వెయ్యి కోట్ల రూపాయల విలువైన భూమిని హైదరాబాద్ నడి బొడ్డున మహిళా సంఘాలకు కేటాయించి, వారి ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మిగతా 2లో..

---

### మాజీ మంత్రి జోగు రామన్నను

## ముందస్తు అరెస్ట్

★ పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జనవరి 16, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని పిలుపునిచ్చిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు అర్ధరాత్రి ముందస్తు హౌస్ అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లోని జోగు రామన్న నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది. అనంతరం అనిల్ జాదవ్ మాట్లాడుతూ, రైతుల పక్షాన పోరాటం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నాయకులను అడ్డుకునేందుకు పోలీసులు అక్రమ హౌస్ మిగతా 2లో..



---

### శబరిమల యాత్రలో

## విషాదం

పట్టణానికి చెందిన దంపతులు

రోడ్డు ప్రమాదంలో మృతి



**లక్షెట్టిపేట, ప్రభాతవార్త**

పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తున్న సత్యనారాయణ జనరల్ స్టోర్ యజమాని పాలకుర్తి సత్యనారాయణ ( 63), రమదేవి (59) దంపతులు అయ్యప్ప మాలలో ఓ ప్రైవేట్ సర్వీస్‌లో శబరిమలై దర్శనానికి వెళ్లారు. 15న అయ్యప్ప స్వామి దర్శనం చేసుకొని తిరుగు మిగతా 2లో..

---

## మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

● రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**రామకృష్ణాపూర్, జనవరి 16, ప్రభాతవార్త**



అర్హులైన లబ్ధిదారలకు ప్రభుత్వ సంక్షేమం పథకాలు అందుతాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు అల్లూరినగర్‌లో మిగతా 2లో..

## మాజీ మంత్రి జోగు రామన్నను ముందస్తు అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే జోగు రామన్నను అర్థరాత్రి హౌస్ అరెస్ట్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించే నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని, ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అనిల్ జాదవ్ తెలిపారు. రైతు సమస్యలపై పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

## శబరిమల యాత్రలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణంలో కన్యాకుమారి వద్ద బైపాస్ రోడ్‌లో నిన్న సాయంత్రం 6 గంటల 55 నిమిషాలకు అయ్యప్ప స్వాముల కోసం రెండు గంటల సేపు టూరిస్ట్ నిలిపివేశారు. సముద్ర స్నానం, అక్కడున్న దేవాలయాలు సందర్శించి టూరిస్ట్ బస్సు ఆపిన చోటికి రాత్రి 9 గంటలకు దంపతులు రోడ్డు దాటుతుండగ ఓ వాహనం ఢీ కొని దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన దంపతుల మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దీంతో పట్టణంలో విషాదఛాయలు అల్ముకున్నాయి.

## మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

73 లక్షల 46 వేల రూపాయలు, 2వ వార్డు తిలక్‌నగర్‌లో 72 లక్షల 56 వేల రూపాయలు, 7వ వార్డులో 72 లక్షల 56 వేల రూపాయలు, 8వ వార్డు చైతన్య కాలనీలో 1 కోటి 89 లక్షల రూపాయలు, 9వ వార్డు ఆర్.ఆర్. నగర్‌లో 46 లక్షల రూపాయలు, న్యూ తిమ్మాపూర్‌లో 52 లక్షలు 50 వేల రూపాయలు, ఓల్డ్ తిమ్మాపూర్‌లో 44 లక్షల 50 వేల రూపాయలు, 12వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో 6 లక్షలు 17 వేల రూపాయలు, 13వ వార్డు ఆమ్‌నగర్ ప్రాంతంలో 6 లక్షల 17 వేల రూపాయలు, 14వ వార్డు మల్లికార్జున నగర్ ప్రాంతంలో 27 లక్షల 22 వేల రూపాయలు, 16వ వార్డు గంగా కాలనీలో 34 లక్షల 64 వేల రూపాయల అంచనా వ్యయంతో టి.యు.ఎఫ్.ఐ.డి.సి., డిఎంఎఫ్‌టి, సిఎస్ఆర్, నగర అభివృద్ధి నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో గల ప్రతి ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే వేసవిలో ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం క్రింద నీటి ట్యాంకులు, ఇతర అనుబంధ పనులను చేపట్టి కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, క్యాతన్‌పల్లి మాజీ చైర్‌పర్సన్ జంగం కళ,నాయకులు శ్యామ్ గౌడ్ ఒడ్నాల శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, మహంకాళి శ్రీనివాస్, పొలం సత్యనారాయణ, పనసా రాజయ్య, భీమా మల్లేష్,గోపతి బానేష్, మేకల శ్రీనివాస్, పుల్లూరి కళ్యాణ్, సంగ రవి, గండి కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జైనూర్ జిన్నింగ్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

జైనూర్, జనవరి 16, ప్రభాతవార్త:

జైనూరు మండల కేంద్రంలో సరాన్ పత్తి జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆకస్మికంగా చెలరేగిన మంటల వల్ల సగానికి పైగా పత్తి కాలి పోయింది. ఘటనా స్థలానికి స్థానికులు చేరి ఫైర్ సిలిండర్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయాణిస్తున్నారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. జిల్లా ప్రజల కోరిక మేరకు బాసరలో యూనివర్సిటీను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి సంపూర్ణంగా సాగునీరు అందిస్తామని వెల్లడించారు. ఇండ్లు లేని పేదలకు నిలువ నీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు. రైతులకు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. అదిలాబాద్ జిల్లాలో పదివేల ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడను నెలకొల్పుతామని చెప్పారు. దీని ద్వారా జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాతో సమానంగా నిర్మల్ జిల్లాకు నిధులు కేటాయించి జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చనక కొరాట, సదర్మాట్ బ్యారేజీల ద్వారా వీడు భూములు సస్య శ్యామలమవుతాయని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సంఘాలకు రుణాల చెక్కులను ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లు కలిసి అందించారు. నిర్మల్ ఉత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు.

### రైతాంగానికి సంపూర్ణంగా సాగునీరు అందిస్తాం

**- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

రాష్ట్రంలోని రైతాంగానికి సంపూర్ణంగా సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమని అన్నారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి సాగునీరు అందిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రాజెక్టులన్నింటిని ఆధునికరిస్తామని వివరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మిగిలి ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తిచేస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదవారికి అందరికీ నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

**- జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పేదల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇల్లు లేని పేద వారందరికీ సొంతింటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించామని చెప్పారు.

అంతకుముందు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ ఆధునీకరించాలని కోరారు. నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని తెలిపారు. జెడ్పి భవన నిర్మాణం తో పాటు, రోడ్లు, వంతెనల నిర్మాణాలు మరమ్మత్తులు చేయాలని చెప్పారు. నిర్మల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన మేర నిధులు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దండే విఠల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# రైతన్నల కొంప ముంచిన మిషన్ భగీరథ వ్యర్థపు నీరు

**సేద్యానికి పనికి రాకుండా పోయిన 400 ఎకరాలు - రోడ్డు ఎక్కుతామంటున్నారు రైతులు...**

దిలావర్పూర్, జనవరి 17, ప్రభాతవార్త:

వ్యవసాయం చేసే రైతులకు పంట సాగుకు ప్రధానమైనది నీరు. అయితే ఆ నీరు లేకపోయినా లేదా అధికమైన కష్టాలు తప్పవు. అదే సంఘటన దిలావర్పూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నీట మునిగి దెబ్బతిన్న తమ భూములను బాగు చేయించాలని గురువారం ఆందోళన చేపట్టారు. మాడెగాం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ గత ప్రభుత్వం పదేళ్ల కిందట ఏర్పాటు చేసింది. ప్రారంభంలో అంతా బాగానే ఉన్నా తరువాత దాని కష్టాలు రైతులను వేధిస్తున్నాయి. ఆ వాటర్ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేయగా మిగిలిన వ్యర్థపు నీటిని దిలావర్‌పూర్ కొత్తచెరువులోకి వదిలారు. ప్రతిరోజు అధికంగా నీరు రావడం వల్ల ఆ చెరువు పూర్తిస్థాయిలో నిండిపోయింది దానిలో నుంచి వచ్చే నీరు దాని కింద ఉన్నటువంటి బ్రాహ్మణ చెరువు మాల చెరువులోకి వెళ్లి అవి కూడా పూర్తిస్థాయిలో నిండాయి. ఇక్కడే రైతులకు తీవ్ర సమస్య ఏర్పడింది. రసాయనిక నీరు చెరువు కింద ఉన్న పొలాలలో అధికంగా నిలిచి సేద్యానికి పనికిరాకుండా పోవడంతో పాటు తుంగ, కలుపు మొక్కలు మొలచి చేతికి రాకుండా పోయింది. ట్రాక్టర్లు, వరి మిషన్‌లు ఆ పొలాలలో పనిచేయకుండా మారాయి. అంతేకాకుండా కూలీలు సైతం భయపడడంతో గత 5 ఏళ్లుగా పంట పండించడానికి అనుకూలంగా లేకుండా పోయింది. ఈ విషయంపై రైతులు పలుమార్లు తాహసిల్దార్, వారిపై అధికారులను కలవడం జరిగింది. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఒకటి రెండు ఎకరాలు ఉన్న సన్న కారు రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమకు చుక్క నీరు కూడా వదల వద్దని వారు ఆందోళన చేపట్టారు. ఈ సమస్యను పరిష్కారం చేయకపోతే తాము రైతులంతా రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. తాము కేసులకు భయపడమని ఎంతవరకైనా వెళ్తామని పేర్కొన్నారు. ఇందులో రైతులు గాంధారి రాజలింగం, నంద రాకేష్, సప్పల రవి, పుస్తపురం రమేష్, కోడే కిష్టయ్య, గుండి సాయన్న, ఒట్టి ముత్యం కోడె దేవవ్వ, సవిత, మహిళలు రైతులు ఉన్నారు.

# రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**





**ఆదిలాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:**

రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం భోరజ్ మండలం హాతిగట్ గ్రామంలోని చనాకకోరాట పంప్ హౌస్ హౌస్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి లతో కలిసి బటన్ నొక్కి ప్రారంభించి, లోయర్ పెన్ గంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, రైతు అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆదిలాబాద్ అడవుల జిల్లా వర్షాధార వ్యవసాయ సాగు చేస్తుందని, ప్రజల త్రాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ప్రజల సుదీర్ఘ స్వప్నం పెన్ గంగ ప్రాజెక్టును సాకారం చేసిందని తెలిపారు. ప్రభుత్వం 1 వేయి 891 కోట్ల రూపాయల వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరు చేయగా 5.12 టి.ఎం.సి. లా నీటిని వినియోగించుకునే విధంగా చనాక కొరాటా బ్యారేజీతో పాటు పెన్ గంగ ప్రాజెక్టు రూపకల్పన చేయబడిందని, ఈ ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్, బీంపూర్, జైనథ్, బేల మండలాలలోని 89 గ్రామాలలో 51 వేల ఎకరాలకు సాగునీరు, ఈ ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు అందించే విధంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఆయకట్టుకు నీటిని అందించేందుకు డి14 నుండి డి19 గల ఉప కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ప్రాజెక్టులు భాగంగా నీటిని నిల్వ చేసేందుకు పిప్పలకోటి బ్యాలెన్సి ంగ్ జలాశయం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చనాక కొర్మాటబ్యారేజ్ కు అనుబంధంగా ప్రధాన కాలువ, మోటార్లతో పంపు హౌస్ పనులు కొనసాగుతున్నాయని, తాంసి, భీంపూర్ మండలాలలోని 15 గ్రామాలలో గల 13 వేల 500 ఎకరాల నూతన ఆయకట్టును వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు 368 కోట్ల రూపాయలతో పరిపాలన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లోయర్ పెన్ గంగ ప్రాజెక్టుకు అనుబంధంగా ప్రధాన కాలువ 47 కి.మీ. నుండి 89.90 వరకు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు డి14 నుండి డి26 వరకు, పిప్పల్ కోటి నిల్వ జలాశయం నిర్మాణం ద్వారా తాంసి, బీంపూర్, ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాలలో గల 75 గ్రామాలలో 51 వేల నూతన ఆయకట్టును వృద్ధిలోకి తీసుకురావడం కొరకు 1 వేయి 227 కోటి రూపాయలు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులకు గాను 3 వేల 313 ఎకరాల భూ సేకరణ అవసరం ఉండగా ఇప్పటివరకు 1 వేయి 545 ఎకరాల భూమి సేకరించి 117 కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగిందని తెలిపారు. ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా 138 కట్టడాలు చేపట్టడం జరిగిందని, సాత్నాల నదిపై 1.675 కిలోమీటర్ల మేర నిర్మించిన ప్రీకాస్ట్ పోస్ట్ టెన్షన్డ్ వయాడక్ట్ కొరకు 259.81 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఉపకాలవల నిర్మాణం చేపట్టి నూతన ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంపొందించడంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అంతకుముందు హెలిప్యాడ్‌కు వద్ద జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పంపు హౌస్ వద్ద పోలీసు గౌరవ వందనం స్వీకరించి, ఫోటో స్టాల్‌ను సందర్శించారు. నీటి విడుదలకు సంబంధించిన వివరాలను కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి, మంత్రులకు తెలియజేశారు. తదుపరి నాగోబా ఆలయ కమిటి సభ్యులు జాతరకు రావాలని ముఖ్యమంత్రి, మంత్రులను కలెక్టర్, ఎస్పీ లతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించి నాగోబా ప్రతిమ గల మెమోంటోను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ స్రవంతి, ఎమ్మెల్సీ దండే విఠల్, జిసిసి చైర్మన్ తిరుపతి, గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, నీటిపారుదల శాఖ ఎస్ఈ విశ్వ కళ్యాణ్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

**- గజానంద్ నాయక్**

**నార్నూర్, జనవరి 16, ప్రభాతవార్త:**

వాభ్తగవంతుడి నామస్మరణ మరియు ఆధ్యాత్మికత అలవర్చుకుంటే జీవితకాల మానసిక ప్రశాంతత లభిస్తుందని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం నార్నూర్ మండలంలోని మహాగం గ్రామంలో నిర్వహించిన అఖండ హరినామ సప్తహ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థులు శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఊని ప్రకాష్, జాదవ్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, మాజీ సర్పంచ్ యశ్వంతరావు రాథోడ్ ఉప సర్పంచ్ రాజేశ్వర్ ఈశ్వర్ దాస్ జాదవ్ రోహిదాస్ మాణిక్ రావు, రాథోడ్ దిగంబర్, రాథోడ్ కృష్ణ, జాదవ్ సచిన్ రోహిదాస్, గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు.





## గ్రామస్తులపై కేసులు ఎత్తేసి..

## లిఫ్ట్ ఇరిగేషన్‌ను బాగు చేయండి: ఎమ్మెల్యే ఏలేటి

**దిలావర్పూర్, జనవరి 17, ప్రభాతవార్త:**

నిర్మల్ పర్యాటనలో భాగంగా వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని దిలావర్పూర్ గ్రామ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విన్నవించారు. ఇథనాల్ పరిశ్రమను తరలించాలని కోరుతూ నిరసన చేసిన 13 మంది గ్రామస్తులపై క్రిమినల్ కేసులు వేసారని తెలిపారు. వాటి వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎంకు సూచించారు. పై అధికారులకు సూచించి ఆ కేసులను ఎత్తి వేసేలా చేయాలని సీఎం ను ఎమ్మెల్యే కోరారు. అంతేకాకుండా లోలం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌ను బాగు చేస్తే వేల ఎకరాలు సాగవుతాయని అన్నారు. దీంతో రైతులు పంటలు సాఫీగా 2 పూటలు పండించుకుంటారని పేర్కొన్నారు. కావున సీఎం నిధులు మంజూరు చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.



## గ్రామ ప్రజా ప్రతినిధులకు సన్మానం

**జన్నారం, జనవరి 16, ప్రభాతవార్త**

జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గ్రామ పంచయతి ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రతినిధులకు ఘనంగా సన్మానం చేశారు. కామన్ పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నూతన అధ్యక్షులు జాడి కిరణ్ ఆదేశాల మేరకు సంస్థ సభ్యులు అందరూ కలిసి కామన్ పల్లి గ్రామ అభివృద్ధి కొరకు స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్, ఉప సర్పంచ్ అలాగే వార్డు సభ్యులకు గల్ఫ్ కార్మికుల సమావేశంలో శాలువా కప్పి ,పూల మాలలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు వంగాల శేఖర్,ప్రధాన కార్యదర్శి చాట్ల తిరుపతి, క్యాషియర్ సాట్ల సత్యం, తాళ్ల పెల్లి రమేష్, సలహాదారులు పంచరూపుల మల్లేష్, లౌడియ అరవింద్,సభ్యులు కొలిమి కుంట్ల లక్ష్మీపతి, పసుల రాజు, కొలిమి కుంట్ల సత్తన్న, మరియు కందుల శ్రీను మాట్లాడుతూ గల్ఫ్ దేశాలలో ఎదుర్కొనే ఇబ్బందులను కష్టాలను తెలియజేస్తూ అలాగే వివిధ దేశాలలో ఉన్న గల్ఫ్ కార్మికులకు స్థానికంగా స్వదేశంలో ఉన్న గల్ఫ్ రిటన్ కార్మికులకు సహాయం చేయడంలో స్థానిక ప్రభుత్వం అండగా ఉండాలని కోరూతు వినతి పత్రం అందజేశారు.




## ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యం

**- జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష**

**జన్నారం, జనవరి 16, ప్రభాతవార్త**

ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యమని జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష అన్నారు. శుక్రవారం నాడు స్థానిక పోలీసు స్టేషన్‌లో వార్త పత్రికా క్యాలెండర్‌ను తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా విలేకరులు పనిచేయాలని, అలాగే పోలీసు శాఖ చేస్తున్న సేవల గురించి ప్రజలకు తెలియచేయాలని అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన వారికి పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్, మహిళల భద్రత వంటి ముఖ్యమైన విషయాల గురించి పత్రికల ద్వారా ప్రజలకు తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**లక్షెట్టిపేట, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొప్పు తిరుపతి (44) పంటకు కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. తన భార్య లక్ష్మికి గత పది సంవత్సరాల నుండి మానసిక పరిస్థితి బాగుండడం లేదు. ఆసుపత్రులు గురించి వైద్యులు ఇచ్చిన మందులు వాడిన మానసిక పరిస్థితి కుదుటపడకపోవడంతో మృతుడు తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిస అయ్యాడు. ఈనెల 15న సంక్రాంతి పండగ ఉండగా చుట్టుపక్కల అందరూ సంతోషంగా కుటుంబ సభ్యులతో పండుగ జరుపుకుంటుండగా తన కుటుంబం మాత్రం ఇలా ఉందని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.



## లక్షెట్టిపేటలో 30 పోలింగ్ స్టేషన్లు సిద్ధం

### - మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్

**లక్షెట్టిపేట, జనవరి 16, ప్రభాతవార్త**

పురపాలక ఎన్నికల నేపథ్యంలో లక్షెట్టిపేట పట్టణంలోని 15 వార్డులకు సంబంధించి 30 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం కార్యాలయ సిబ్బందితో కలిసి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలను కలెక్టరేట్, ఆర్డీవో, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై అందుబాటులో ఉంచామని, ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని చూసుకోవాలని ఆయన సూచించారు.




చిన్నారులకు పతంగులు పంపిణీ చేసిన వాసవి క్లబ్ సభ్యులు

## ఘనంగా పతంగుల పండగ

**ఆసిఫాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:**

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పతంగుల పండగను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణలోని స్థానిక హోలీట్రినిటీ ఉన్నత పాఠశాలలో సంక్రాతి పండగను పురస్కరించుకొని పతంగుల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షాకార్యదర్శులు ఉదయబాబు, శ్రీనివాస్ లు కలిసి 100 మంది చిన్నారులకు పంతంగులు, దారం రీళ్ళు అందజేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అంతర్జాతీయ సభ్యులు ఏకిరాల శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వాసవి ఆలయ కమిటి అధ్యక్షుడు రావుల శంకర్, క్లబ్ కోశాధికారి శ్రీధర్, మాజీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, శంకర్, వేణుగోపాల్, సభ్యులు రవీందర్, ప్రశాంత్, కృపాల్, జగదీష్, నితిన్, శ్రీనివాస్,నీలేష్, అమూల్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

## శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

**ఆసిఫాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:**

41 రోజుల మండల దీక్ష అనంతరం పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు గురువారం శబరిమలకు బయలుదేరారు. అంతకుముందు ఆసిఫాబాద్ పట్టణం పెద్ద వాగు సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో రెబ్బెనకు చెందిన గురుస్వామి సూర్య భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నాగేశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గాదెవేణి మల్లేష్ ఆధ్వర్యంలో స్వాములు, భక్తులకు బిక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్, స్వాములు వెంకట్ గౌడ్, చంద్రమోహన్, శ్రవణ్, శ్రీనివాస్, తిరుపతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, భక్తులు వినాయక్, శ్రీకాంత్, సంతోష్, శ్యామ్, నరేష్తో పాటు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వాములకు ఇరుముడి కడుతున్న గురుస్వామి భాస్కర శర్మ

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట, జనవరి 16, ప్రభాతవార్త**

జిల్లాలోని గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలోని సాగు భూములలో చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని తానిమడుగు వద్ద గల గూడెం ఎత్తిపోతల పథకం నుండి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, నీటిపారుదల శాఖ, ఇతర అధికారులతో కలిసి సాగునీటి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గూడెం ఎత్తిపోతల పథకం నుండి సాగు భూముల చివరి ఆయకట్టు వరకు పంట సాగుకు అవసరమైన నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు అవసరం అయిన నీటిని ప్రణాళిక బద్ధంగా విడుదల చేయడం జరుగుతుందని, ఈ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.. జిల్లాలో వరి ధాన్యం సాగు సకాలంలో ప్రారంభించాలని, ఆలస్యంగా సాగు చేయడం వలన ఇబ్బందులు ఎదురవుతాయని, సాగుకు అవసరమైన నీటిని సకాలంలో అందిస్తామని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 20 టిఎంసిల నీరు ఉందని, కార్యచరణ ప్రకారం సాగునీరు, త్రాగునీటికి వినియోగించడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో పంట సాగుకు అవసరమైన సాగునీటిని పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు అందించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా పైప్ లైన్ల మరమ్మత్తులను చేపట్టి పనులు పూర్తి చేసి సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ముచ్చటైన ముగ్గేసి.. ప్రథమ బహుమతి గెలిచి

**జన్నారం, జనవరి 16, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో ముచ్చటైన ముగ్గేసి ప్రథమ బహుమతి గెలుచుకుంది మదిరే కవిత.జన్నారం మండలం పొనకల్ మేజర్ పంచాయతీ రాంనగర్ కాలనీలో కీర్తిశేషులు పోతు శంకర్ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు నిర్వచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పోటీలు నిర్వహించిన గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపునకు సోపానాలని అన్నారు. ఈ కాలనీలో 96 మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి మదిరే కవిత, ద్వితీయ బహుమతి చిలువేరి నిరోషా, తృతీయ బహుమతి జోరిగే సునీత లు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు బహుమతుల ప్రధానం కోసం మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, తాజా మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, పొనకల్ రెండవ వార్డ్ సభ్యులు పిల్లి మల్లయ్య, పొనకల్ మూడో వార్డు సభ్యులు జాజాల లతా శ్రీకాంత్‌లు సహాయ సహకారాలందించారు. ఈ సందర్భంగా భూమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, దీనికి తాను ఎప్పుడూ సహకరించడం జరుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా జక్కు భూమేష్ జన్మదిన సందర్భంగా ఇదే కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ముగ్గుల పోటీలో ముగ్గురే కాకుండా మరో ఐదుగురికి సైతం కన్సోలేషన్ బహుమతులు సైతం అందజేశారు. మిగతా అందరికీ పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరి నర్సయ్య, మహేంద్ర సంఘం మండల కోశాధికారి పిల్లి మల్లయ్య, మండల ఉపాధ్యక్షులు పర్ల కనకయ్య, మహేంద్ర యూత్ అధ్యక్ష కార్యదర్శులు సంద కృష్ణ, చిలువేరి సుధీర్ కుమార్, పోతు సురేష్, పర్ల శంకర్, మదిరె సతీష్, కనికరం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నోములు ఇచ్చుకొంటున్న మహిళలు

## ఘనంగా కనుమ పండుగ

**ఆసిఫాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:**

సంక్రాంత్రి పండగ ముడవ రోజులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో కనుమ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కనుమ సందర్భంగ గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు నోములను వాహినంగా ఇచ్చిపుచ్చుకొన్నారు. గౌరీ పూజ చేయడం వలన సౌభాగ్యం నిలుస్తుందని అమ్మవారిని వేడుకొంటారు. నువ్వులు, బెల్లంతో తయారు చేసిన పిండివంటకాలను ప్రసాదంగా స్వీకరిస్తారు.

## గృహజ్యోతి లబ్దిదారులకు పత్రాల పంపిణీ

**ఆసిఫాబాద్, జనవరి 16, ప్రభాతవార్త :**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గృహజ్యోతి, వ్యవసాయ లబ్ధిదారులకు పంపించిన పత్రాలను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని ఎల్లారం గ్రామంలో విద్యుత్ శాఖ ఎస్ఈ జాడే ఉత్తమ్ లబ్ధిదారులకు ఈ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గృహజ్యోతి పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఎస్ఈ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఏఓ దేవిదాస్, ఏడిఈ శ్రీనివాస్, రూరల్ ఏఈ ఊర్మిళ, లబ్దిదారులు పాల్గొన్నారు



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ఎస్సై జగదీశ్వర్ రెడ్డి

**వేమనపల్లి, జనవరి 16, ప్రభాతవార్త**

రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు రోడ్డు భద్రతపై తహసీల్దార్ సాయికృష్ణతో కలసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతర ప్రాణాలను కూడా రక్షించాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని, సీట్ బెల్టు తప్పకుండా ఉపయోగించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చున్నారు. అనంతరం స్థానికులతో కలసి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



## హెల్మెట్ వినియోగంపై అవగాహన

**సారంగాపూర్, జనవరి16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగంపైన అవగాహన కల్పించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్, రవాణా, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా అరైవ్ అలైవ్ - 2026 పేరిట 10 రోజుల రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమం రెండో రోజులో భాగంగా, ఎస్ పి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగం గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హెచ్ సి నూర్వంత్, కానిస్టేబుల్స్ ప్రణీత్ రెడ్డి, వినిల్, మాధవ్, ఆకాష్, రమణ, శ్రీలత పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్

## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**సారంగాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:**

మండలంలోని కంకట గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ సిద్ధికార్ సాహెబ్ రావు ప్రారంభించారు. ఎన్నికై పరిపాలనా బాధ్యతలు చేపట్టి శుక్రవారం తొలివిడుత ఉపాధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

### సొంతగూటికి నాయకులు

**జైనూర్, జనవరి 16, ప్రభాతవార్త:**

జైనూర్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. ఇటీవల టిఆర్ఎస్ పార్టీ లో చేరిన పలువురు నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీ గూటికి మల్లి చేరుకున్నారు. పార్టీలో చేరిన వారిని నాయకులు పార్టీ కండువా కప్పి సాధరంగా వాటిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖీద్ అహ్మద్, సీనియర్ నాయకులు మెస్రం అంబాజీ రావు, మాజీ ఎంపీటీసీ అజ్జు లాల, అహ్మద్ ఖాన్, నాయకులు షేక్ రహీం, పార్టి మండల ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్ , మాజీ ఉపసర్పంచ్ షేక్ అబ్బు, నాయకులు కోట్నాక్ దావలత్ రావు, సయ్యద్ వసీం, షేక్ మజర్, బూతాలే కిరణ్, గెడాం గోపీచంద్, సర్పంచ్ జాదవ్ విఠల్, దత్త, షాకిర్, మొహిద్దిన్, రియాజ్ ఖాన్, మగ్దూం ఖాన్, షేక్ ఉమర్, షేక్ నసీర్,షారుక్, మాజిద్, అన్వర్, సయ్యద్ సద్దాం తదితరులున్నారు.





మాట్లాడుతున్న మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌రావు



# సంక్రాంతి అందరి జీవితాల్లో కోటి కాంతులు నింపాలి

**- మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌రావు - కోసిని సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సర్పంచ్ వశాకె పుల్లబాయి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రకరకాల రంగులతో ఆకట్టుకునేలా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యామ్ రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో విజేతలకు మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన వారికి బహుమతులు ఇవ్వడం అందజేయడంతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కంసోలేషన్ బహుమతులు అందజేశారు. అదే విధంగా క్రికెట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లెండుగురే. శ్యామ్ రావు ఈ పండుగ మీ అందరి జీవితాల్లో కోటి కాంతులు నింపాలని, మీ అందరి జీవితాల్లో ఆనందం రావాలని, అష్ట ఐశ్వర్యాలు, భోగభాగ్యాలు తీసుకు రావాలని,దేవుణ్ణి కోరుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా మాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తీరాలంటే మనకు ఎస్టీ హోదా కావాలని దీనికొరకు మనం గత 30 సంవత్సరాల నుండి పోరాడుతున్నామని అన్నారు. దానిఫలితంగానే అప్పటి ముఖ్యమంత్రి గౌరవ కేసిఆర్ మాలీలకు ఎస్టీ హోదా కొరకు అసెంబ్లీ సాక్షిగా పెద్దల సభలో గిరిజనులకు పెంచుతున్న 14 శాతం రిజర్వేషన్ లో భాగంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు అది కేంద్రంలో పెండింగ్‌లో ఉందని కావున మన ఏకైక లక్ష్యం ఎస్టీ హోదా సాధించడమేనని దీనికొరకు మనం ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయుటకు కార్యాచరణ ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. దీనికి యావత్ రాష్ట్రం లోని మాలీ లందరు ఐకమత్యంగా ఉండి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. రాబోయే కాలంలో మాలి సంక్షేమ సంఘం ఎలాంటి కార్యాచరణ తీసుకున్న మీరందరూ కలిసి పోరాడడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కారక్రమంలో వసాకే హనుమంతు, కొట్రంగి రాము, గ్రామ పటేల్ గ్రామ వార్డ్ మెంబర్లు రవీందర్, రవి పెద్దలు గ్రామ యువకులు ,గ్రామ మహిళలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పత్రిక

**జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి - వార్త క్యాలెండర్ ఆవిష్కరణ**

**సారంగాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పత్రిక అని జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆధ్వర్యంలో వార్త నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు నిరంతరంగా సమాచారాన్ని అందించి, అభివృద్ధి పథంలో ప్రజలను నడిపేది పత్రిక అని, సమాజంలో జరుగుతున్న అరాచకాలు వెలికితీసి ప్రజలను చైతన్యవంతం చేస్తుందని అన్నారు. అన్ని రకాలుగా నూతన అంశాలను ప్రజలకు అందిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు నాలుగోస్థంభం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ నాయకులు, వార్త విలేకరులు పాల్గొన్నారు.



# నాను మహారాజ్ జాతర సందర్శించిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



మండలంలోని బండరేవ్ తండాలో వేడుకల్లో సందర్భంగా నిర్వహించిన నాను మాహారాజ్ 33వ జాతరలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి పాల్గొన్నారు. ఎమ్మెల్యే జాతర నిర్వహకులు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించినారు. అనంతరం కబడ్డీ పోటీలు ప్రారంభించారు. పోటీలకు మహారాష్ట్ర, తదితర ప్రదేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పండుగలు, సాంప్రదాయాలని పాటిస్తూ, మన రాబోయే తరానికి తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, మండల నాయకులు, బిజెపి మండల అధ్యక్షుడు నరేష్, నిర్వాహకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు...

**- విజేతగా నిలిచిన బ్రదర్స్ టీం**

**దిలావర్‌పూర్, జనవరి 17, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ఈనెల 11న డిపిఎల్ సీజన్ 2 పేరిట క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మాజీ సర్పంచ్ పాల్దే దేవన్న స్మారకంగా వారి కుమారుడైన ప్రస్తుత సర్పంచ్ పాల్దే అక్షర అనిల్ ఈ టోర్నమెంటును ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో 13 జట్లు పాల్గొన్నాయి. వీటిలో బ్రదర్స్ టీం, ఫ్రెండ్స్ టీం ఫైనల్లో ఓరాహోరీగా తలపడ్డాయి. వీరిలో బ్రదర్స్ టీం విజేతగా నిలిచింది. మొదటి బహుమతి గా 10 వేలు, ద్వితీయ బహుమతిగా 5 వేలు అందించారు. గెలిచిన వారికి ట్రోఫీ, క్రీడాకారులకు మెమొంటోస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుఖేష్, వార్డు మెంబర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెపల్లెలో సంక్రాంతి సంబరాలు

**– అంగరంగ వైభవంగా భోగి, సంక్రాంతి, కనుమలు – ఆలయాలకు పోటెత్తిన భక్తులు**

**– ఇంటింటా నోములు, ఊరంతా సందడి**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త

మూడు రోజుల సంక్రాంతి సంరాలు అంబరాన్నంటాయి. భోగి మంటలతో ప్రారంభమైన పండుగ కనుమతో ముగిసింది. మొదటి రోజు భోగి మంటలు, ఇళ్ల ముందు రంగవ ల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటపాటలు, పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ అలరించారు. రెండో రోజు మకర సంక్రాంతి రోజు రంగవల్లులు, ఆలయాల్లో పూజలు, పిండి వంటలు, ఆటల పోటీలు ప్రారంభించారు. మూడో రోజు కనుమ పండగ ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామీణ సాంప్రదాయం ఉట్టి పడే విధంగా గ్రామీణ క్రీడలు, ముగ్గుల పోటీలు, బంధుమిత్రులతో కలిసిఅలంపూర్లో ముగ్గుల పోటీల్లో మహిళలుసహపంక్తి భోజనాలతో గ్రామాలు సందడి సందడిగా కనిపించాయి. పాత కొత్త బంధువుల కయిక, దూర ప్రాంతాల్లో నివాసం ఉంటూ పండగా లకు వచ్చిన బంధువులతో పల్లెలు కళకళాడాయి. భోగి మంటలు.. పాల పొంగు... ఆట పాటలు... మంగళగౌరి, సందె దీపాల నోములు... చక్కెర పొంగలి.. నోరూరించే అరిసెలు.. గాలి పటాలు ఎగుర వేస్తూ మూడు పండుగల వేడుకలను కాగజ్‌నగర్ మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటలతో పాత జ్ఞాపకా లను వదిలేస్తూ.. నవ వసంతానికి స్వాగతం పలి కారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటి ముందు నవధాన్యాలను ఏర్పాటు చేసి, పాలు పొంగించారు. కనుమ పండుగను పురస్కరించుకుని సామూహిక నోములు, వ్రతాలను నోచుకున్నారు. సంక్రాంతి, కనుమను పండుగను పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

### ఇంటింటా మంగళగౌరి, సందె దీపాల నోములు..

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సందె దీపాలు, మంగళగౌరి, చుక్కల పర్వతం, కరీ, గాంధారీ, మూల పసుపు, దాంపత్య, గంగాగౌరి, పసుపు కుంకుమ, వంచ పాండవులు, పారిజాతం , చెట్టుకింద గొల్లభామ, ఒత్తులు, కుంకుమ చెంబు నోములు నోచుకున్నారు. నోముల అనంతరం ఒకరినొకరు వాయినాలను ఇచ్చి పుచ్చుకు న్నారు. వాకిళ్లన్నీ రంగు రంగుల ముగ్గులతో హరివిల్లు తలపించాయి. కనుమ రోజు పాడి గేదెలు, దుక్కిటెద్దులను పూజించారు. పలు గ్రామాల్లో ఎండ్లపోటీలు నిర్వహించారు. పిల్లలు మైదానాలకు వెళ్లి గాలిపటాలను ఎరుగవేస్తే, కుటుంబ సభ్యులు ఇంట్లో బిజీబిజీగా గడిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కెరమెరి, జనవరి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రంకు చెందిన రాపర్తి సంతోష్ (26) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లాలోని ఏదుపుల పాలెం హైదరాబాదులోని రింగ్‌రోడ్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది మృతుడికి రెండు నెలల క్రితమే వివాహమైంది.



పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, పీఆర్‌టీయూ నాయకులు

## పీఆర్‌టీయూ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త :

పీఆర్‌టీయూ తెలంగాణ వాల్ క్యాలెండర్‌ను గురువారం సిర్పూర్ శాసన సభ్యులు పాల్వాయి హరీష్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ ,ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, రాష్ట్ర అసోసియేటేట్ అధ్యక్షులు కటుకం మధుకర్, రాష్ట్ర కార్యదర్శులు సుధాకర్, రాజేష్ వనమాల, దొడ్డిపట్ల రవి కుమార్ వెంకటరమణ సుమిత్ర, జిల్లా నాయకులు పార్వతి రాజేశ్వర్, సబీర్ చంద్రకళ, చిలుకూరి రవీందర్, మదను శ్రీనివాస్, జర్పుల వస్త్రం, దొంగ్రి గజానన్, మండదే శ్రీనివాస్, మహిళ నాయకులు సుమిత, ఉమారాణి, బంక శారద, లక్ష్మీ ప్రసన్న, కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు బి. స్వామి, రెబ్బెన అధ్యక్షులు కమెరా శ్రీనివాస్, గుడెపు విజయ్ రావు, సిర్పూర్ ప్రధాన కార్యదర్శి జలపతి, వెంకటేష్, కౌటల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు మెంబర్లు

## క్రీడా స్థలం కోసం తహసీల్దార్‌కు వినతి

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో క్రీడాకారుల కోసం క్రీడాస్థలం కావాలని కోరుతూ శుక్రవారం కాగజ్‌నగర్ తాసిల్దార్ మధుకర్‌కు సర్పంచ్ వసాకె పుల్లబాయి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో క్రీడా స్థలం లేకపోవడంతో గ్రామంలోని యువతకు, విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిఉన్నప్పటికి క్రీడా స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని క్రీడా స్థలం కోసం కృషిచేయాలని వారు కోరారు. వినపత్రం ఇచ్చిన వారిలో వసాకె హనుమంతు, వార్డ్ మెంబర్ గూర్లె శ్రీనివాస్, గౌత్రే బాబుల్, ఆదే హరిదాస్, గుర్లే పాలక్ రావ్‌లు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**- ఈస్గాం ఎస్ఐ కళ్యాణ్**

కాగజ్‌నగర్ రూరల్ ,జనవరి 16, ప్రభాతవార్త :

ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఈస్గాం ఎస్సై కళ్యాణ్ అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్సై కళ్యాణ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్లపై అధిక వేగంతో, మద్యం సేవించి వాహనం నడపొద్దని, అలాగే ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళ్యాణ్

## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**- ఎస్ఐ మధుకర్**

కెరమెరి, జనవరి 15, ప్రభాతవార్త :





జిల్లా ఎస్పీ నికిత పంత్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్ ఐ .మధుకర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి మండల ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ద్వారానే ఎక్కువ మరణాలు జరుగుతున్నాయని అన్నారు ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడుపుతున్న సమయంలో హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి ఎటువంటి వాహనాలు నడపవద్దని కారు నడుపుతున్న సమయంలో ఖచ్చితంగా సిట్ బెల్ట్ పెట్టుకోవాలని, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని అన్నారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రియాన్ వైద్య సిబ్బంది, నాయకులు కంబాల వినేష్, సీపీఐయూ మండల కన్వీనర్ ఆనంద్ రావు,చంద్ర శేఖర్, రుద్ర దాస్,శ్రీకాంత్ ఉన్నారు



## ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసం వద్ద బసవన్నల ప్రదర్శన

నేరడిగొండ, జనవరి 15, ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసం వద్ద బుధవారం ఉదయం బసవన్నల ప్రదర్శన జరిగింది. గ్రామీణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఈ బసవన్నలు నివాసానికి చేరుకుని ప్రదర్శన ఇవ్వడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బసవన్నల ప్రదర్శనను వీక్షించారు. అనంతరం ప్రజలకు మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఐక్యతతో జరుపుకోవాలని ఆయన తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అభ్యర్థులను గెలిపించండి

ఆసిఫాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:

రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను భారీ సంఖ్యలో గెలిపించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి కోఆర్గనైజేషన్ కమిటీ ఇంచార్జి మంథని సంపత్కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అడక్ కమిటీ సభ్యులు మరియాల వినీత్కుమార్ తో కలిసి మాట్లాడుతు జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరించేందుకు పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు జనసేన పార్టీలోకి చేరుతున్న సందర్భంలో వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణ, రమేష్, శ్రీకాంత్, ప్రేమ్ సాగర్, రాహుల్, తిరుపతి, నవీన్, అఖిలేష్, రవి, వంశీ, నితిన్, కార్యకర్తలు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జనసేన ఉమ్మడి జిల్లా కో ఆర్గనేషన్ కమిటీ ఇంచార్జి సంపత్ కుమార్



# సభను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

## - కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా సాగేందుకు సహకరించిన జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బందికి, పోలీసు శాఖకు, బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలకు, అలాగే సహకరించిన ప్రజా ప్రతినిధులకు కలెక్టర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



గృహలక్ష్మి పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఏఈ

# గృహ లక్ష్మి పథకం పత్రాల పంపిణీ

**పెంచికల్‌పేట్, జనవరి 16, ప్రభాతవార్త:**

పెంచికల్ పేట్ గ్రామంలో గృహలక్ష్మి ృ పథకం కింద అర్హులైన కుటుంబాలకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శుక్రవారం సర్పంచ్ ఉస్మాన్ ఆధ్వర్యంలో మండల విద్యుత్ అధికారి అంజల్ కుమార్ పత్రాలను అందజేశారు. సర్పంచ్ గ్రామంలో లోవోల్టేజ్ సమస్యలు, పాత కరెంట్ పోల్స్ మరమ్మత్తులు, కిందకు వేలాడుతున్న తీగలు, నూతన మీటర్ల అవసరం తదితర అంశాలను ఏఈ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఏఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్యాల శేఖర్ లైన్మెన్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యం: ఎస్సై

**పెంచికల్‌పేట్, జనవరి 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో శుక్రవారం ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఖిఅరైవ్ అలైవ్ఖి రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తాసిల్దార్ కార్యాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఖిఅరైవ్ అలైవ్ఖి కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ సైడ్, డ్రైవింగ్ సిగ్నల్, జంపింగ్ వంటి నిరక్ష్యపు చర్యలే ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. అతిక్రమించిన వారిపై తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిటి చిన్ను, ఆర్ఐ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణ, భద్యత కొరకే ఎస్ఎస్‌డి క్యాడర్ క్యాంప్

## - తెలంగాణ రాష్ట్ర మాస్టర్ ట్రైనర్ గోవర్ధన్

**వాంకిడి, జనవరి 16, ప్రభాతవార్త:**




స్టడీ సర్వీస్ డెవలప్మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ గోవర్ధన్

సమాజంలోని యువకులకు, విద్యార్థులకు క్రమ శిక్షణ, భద్యత కొరకే ఎస్ఎస్డి క్యాడర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మాస్టర్ ట్రైనర్ జెల్లా గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో ప్రారంభమైన 5 రోజుల సమతా సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డి)క్యాడర్ క్యాంప్ ప్రారంభించిన అనంతరం మాట్లాడాతూ ఎస్ఎస్‌డి క్యాంపెనింగ్ (స్టడీ, సర్వీస్, డెవలప్‌మెంట్) వల్ల అనేక లాభాలు ఉన్నాయని, క్యాంపెనింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందిస్తుందని, ఇది వారి విద్యా పాఠ్యాంశాలను బలోపేతం చేస్తుందని, విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనడం ద్వారా సామాజిక బాధ్యతను అర్థం చేసుకుంటారని, క్యాంపెనింగ్ ద్వారా విద్యార్థులకు నాయకత్వం, సమస్య పరిష్కారం, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చెంది,నెట్‌వర్కింగ్ అవకాశాలు విద్యార్థులు వివిధ సంస్థలు మరియు వ్యక్తులతోపరిచయం ఏర్పరచుకుంటారని అయన పెర్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ డి క్యాడర్ కమాండర్ దీక్షా కోబ్రగడే,సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, అంబేద్కర్ సంఘం కార్యదర్శి రోషన్ ఉప్రే, సమాజ్ పెద్ద మనుషులు శ్యామ్ రావు లహుజీ దుర్గే, రాజేశ్వర్, నాయకులు బల్వంత్, విద్యాసాగర్, అరుణ్, రమేష్, మనోజ్, ఇంద్రజీత్ తదితరులు పాల్గొన్నారు.

# ఓమోజయ ఊర్జీషా ఆలయానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**దిలావర్‌పూర్, జనవరి 16, ప్రభాతవార్త:**




భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం గ్రామ శివారులో గురువారం పరమ పవిత్రమైన ఓమోజయ ఊర్జీషా నిలయం భూమి పూజ మహోత్స వమును ఘనంగా నిర్వహించారు. పరార్ధోమోజయులు శ్రీ మూర్తికి కలశ పూజ, దీపారాధన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మికంగా ముందుకు సాయి ప్రతి మనిషికి శాంతి ప్రశాంతత ఉంటాయని వారు పేర్కొన్నారు. మంచి చెడులను బోధించేది కేవలం గురవేనని తెలిపారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తి ఓమోజయవారు అని కొనియాడారు. అనంతరం పరార్ధోమోజయులు, దిలావర్‌పూర్ సేవాసమితి బృందం వారు ఆయనను ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఆయనతో పాటు వచ్చిన వివిధ గ్రామ సర్పంచులు, పలు పార్టీ నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గ్రామ సర్పంచులు సూర శ్రీలత, పల్దె అక్షర అనిల్, తక్కల రమణారెడ్డి, ఉప సర్పంచ్ సుఖేష్, జిల్లా సీనియర్ నాయకులు దొడ్డికింది ముత్యంరెడ్డి, సామ రాజేశ్వర్, వీరేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు కట్కం రాజారెడ్డి, తక్కల సాగర్ రెడ్డి, కొమ్ముల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఎలల చిన్నారెడ్డి, తోడిశెట్టి సుదన్, తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే

**నేరడిగొండ, జనవరి 16, ప్రభాతవార్త:**



బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను ఆయన వివరించారు. కుప్టి ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని, పిప్పలకోటి భూ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే బజార్‌హత్నూర్ మండలంలోని దేగాం ప్రాజెక్టు భూ నిర్వాసితులకు కూడా న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గంలో నూతనంగా 60 చెరువులను మంజూరు చేయాలని, గతంలో ఆమోదం పొందిన 28 చెరువులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బోథ్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనే డిమాండ్‌ను కూడా వినతిపత్రంలో పొందుపరిచారు. పిప్రి, తేజపూర్, బుగ్గారం, సుంకిడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ పనులను ప్రారంభించాలని, బరంపూర్ నుంచి మోర్ఖండి, సిరిచేల్మా నుంచి పెంబి వరకు రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా బోథ్ పట్టణంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థాపనకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి ఈ పనులు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు.



## మార్లవాయి గ్రామపంచాయతీ అభివృద్ధికి జీవో జారీ

### ప్రజా పాలన ప్రభుత్వానికి సర్పంచ్ కనక ప్రతిభ కృతజ్ఞతలు

**జైనూర్, జనవరి 16, ప్రభాతవార్త**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి మార్లవాయి గ్రామపంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్లవాయి గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసినందుకు ప్రజా పాలన ప్రభుత్వానికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా, బోరజ్ మండలం హత్తిగుట్ట-చనాక-కొరాటా పంప్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సమయంలో మర్యాదపూర్వకంగా కలిసి సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు. మార్లవాయి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, త్రాగునీరు, పారిశుద్ధం, విద్య తదితర ప్రజా అవసరాల కోసం మంజూరైన నిధులు గ్రామ ప్రగతికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నందుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో మార్లవాయి గ్రామాన్ని ముఖ్యమంత్రి సందర్శించాలని కోరారు. మార్లవాయి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మార్లవాయి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రతి ఒక్కరూ రోడ్ భద్రత నియమాలు పాటించాలి: ఎస్.ఐ భూమేష్

**రామకృష్ణాపూర్, జనవరి 16, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ రోడ్ భద్రత నియమాలు పాటించాలని ఎస్.ఐ భూమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు భద్రతా సెల్ (పోలీస్, ట్రాన్స్‌పోర్ట్ హెల్త్ విభాగాలు) వారి పిలుపు మేరకు అరైవ్-అలైవ్ 2026 పేరిట రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని 10 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మామిడిగట్టు గ్రామం, ఆదిల్‌పేట్ గ్రామం, పొన్నారం గ్రామాలలో గ్రామస్థాయిలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరిగింది. 2వ రోజు ఏరియా హాస్పిటల్, రామకృష్ణాపూర్ సిబ్బందితో పాటు క్యాథన్‌పల్లి మున్సిపాలిటీ సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రజల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు. అలాగే హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం తాగి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అరైవ్ అలైవ్-2026 కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించి, ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చేయడమే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.



# సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాలకు సాగునీరు

### - రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి



**నిర్మల్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. 2016 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును 676.592 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించగా, ఇందుకోసం 1,176 ఎకరాల భూమిని సేకరించారని పేర్కొన్నారు. ఈ బ్యారేజీ ద్వారా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాల్లో 12 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో 5 వేల ఎకరాలు కలిపి మొత్తం 18,016 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో కడెం, ఖానాపూర్, కోరుట్ల మండలాల్లోని 34 గ్రామాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుందని వివరించారు. పాత సదర్మాట్ అనికట్, గంగానాలా ఆయకట్టు స్థిరీకరణకు 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా విడుదల చేస్తామని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో పాటు, పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతం

**బెజ్జూర్, జనవరి 16, ప్రభాతవార్త:**



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఎల్ఏ

బెజ్జూర్ మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీర్తి డెంటల్ క్లినిక్ వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నోటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎంఎల్ఏ సూచించారు. నియోజకవర్గంలో అత్యధికులు తంబాకు, గుట్కా, కర్రలకు బానిసలుగా ఉన్నారని వీటివల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున వీటిని వెంటనే మానేయాలని తెలిపారు. నియోజకవర్గంలో డయాలసిస్ పేషెంట్లు అధికంగా ఉన్నందున వారికోసం కౌటాలలో 5 డయాలసిస్ యూనిట్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలోని అన్ని అవయవాల సమన్వయంతోనే అది సాధ్యమని డాక్టర్ కీర్తి అన్నారు. దంతాలు ఆరోగ్యంగా ఉంటేనే తిన్నది అరుగుతుందని అన్నారు. కావున దంతా ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించకూడదని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడమే తమ లక్ష్యమని టిడిఎస్ఏ చైర్మన్ మణిదీప్ బలుసాని అన్నారు. ఈ శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించినట్లు డాక్టర్ కీర్తి తెలిపారు. అంతకుముందు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎంఎల్ఏ, సర్పంచులను టిడిఎస్ఏ సెక్రటరీ సామల రసజ్ఞ, అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, డాక్టర్లు శ్రావణ్, శ్రీనివాస్, హర్షిని, సౌమ్య, షఫియా, సర్పంచ్ దుర్గం సరోజా తిరుపతి, మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్గౌడ్, నాయకులు తేలి బాపు, జాడి తిరుపతి, గూడ రాకేష్, దుర్గం జ్యోతి, సామల రాజన్న, సామల తిరుపతి ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి

**ఆసిఫాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:**



రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ శుక్రవారం సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్న దృష్ట్యా ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని సూచించారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, అలాగే నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్ వినియోగించాలి అని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ రోడ్డు భద్రతా కార్యక్రమం 16 నుండి 27 వరకు కొనసాగుతుందని, ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహిస్తూ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పిస్తామని తెలిపారు. ప్రజల భద్రతయే పోలీస్ శాఖ ముఖ్య ఉద్దేశమని జిల్లా ఎస్పీ అన్నారు.